కథానిక

# గులాబీ మొక్క

ఆర్. యం. చిదంబరం

క్రితంరోజు ఓ సుమిత్రుడి బలవంతం వలన రెండో ఆట సినిమాకెళ్ళి కాకినాడ వీధులన్నీ సర్వే చేసి రాత్రి రెండుగంటలకు ఇంటికి రావటం వలన ఈరోజు మెదడు తిన్నగా పనిచేయకపోవడంవలన ఆఫీసరు పెట్టిన ఘాటు చీవాట్లు నాలుగూ బుజాన్నేసుకొచ్చిన కేశవరావుకి, వయ్యారంగా జడవూగిస్తూ—కళ్ళను తళుక్కుమనిపిస్తూ ఓ కరకమలంలో ఘుమఘుమలాడేవుప్మా- మరొక పద్మంలో పొగలుకక్కుతున్న కాఫీతోను సుశీల ఎదురవక పోయేసరికి మనిషికి రావలసినంత కోపమూ—చిరాకూ కలిగాయి. పోనీ ఏ వంటింట్లోనైనా వుండి తను విజయం చేయటం గమనించలేదేమోననుకుంటే- ఎదురుగా కుర్చీమీద చెయ్యి ఆనించి తెల్లగా బోడిగావున్న ఆకాశంకేసి చూస్తుందేమిటి? అందుకూ అతనికోపం. అతను ఆఫీసుదుస్తులు మార్చుకుంటున్నంతసేపూ వూరుకుంది. కేశవరావు సముద్రపు అలలా ఎగిరిపడదామనుకున్నాడు.

‘ఛీ... వెధవ సంసారం - వెధవ ఇల్లు. నరకమన్నా దీనికంటే నయం’ అన్నాడు. అతను అర్థం పర్థం సవ్యాపసవ్యాలులేకుండా వెధవ శబ్దం వుపయోగించటం ఇది రెండోసారి. అందుకు అతనాశించిన విధంగా సుశీల ఎలాంటి అభ్యంతరమూ చెప్పలేదు. పైగా—

“బాగాచెప్పారు. నాకూ అలాగే అనిపిస్తోంది సుమండీ” అంది. అసలే చలితో వొణికే వాడిమీద ఐస్ వాటర్ దిమ్మరించినట్టయింది. అతని కోపం కాస్తా వేడిచేసిన ధర్మామీటరులోని పాదరసంలా చకచకాపైకి పాకింది. స్వతహాగా అతనికి భరతనాట్యం రాకపోయినా, ఆ క్షణంలో కలిగిన ఆవేశంతో రెండుచేతుల్తోను నాట్యాభినయం చేస్తూ——“అదేంమాట!...నీకొచ్చిన లోటేమిటి? హాయిగా కాలుమీద కాలేసుకుని టింగురంగాని కులుకుతూంటావ్, ఏం సాధక బాధకాలున్నాయని- మేం వున్నాంగా అగచాట్లన్నీ పడటానికి. మధ్య తనకు నరకంలా వుందట” అనరిచాడు.

వంటింట్లో కాఫీమాత్రం చల్లారిపోతోంది.

“అనండి...అనకేం చేస్తారు? నాగోడ వెవరికి పట్టింది కనక - మీ స్నేహితులూ - ప్రతిరోజూ అర్థరాత్రిదాకా సినిమాలు - వాట్లతోనే సరిపోతుంది మీకు...” సుశీల గభుక్కున సంభాషణ తుంచేసి వంటింట్లోకెళ్ళి కాఫీ తీసుకొచ్చి బల్లమీద వుంచింది. మర్చిపోయినందుకు క్షమించమన్నట్టు అతనికేసి వోమాటు చూసింది. వేడిచేసిన ధర్మామీటరును హఠాత్తుగా ఐస్ టబ్‌లో ముంచితే పాదరసం యెలా దిగజారుతుందో అలాగే, పెరుగుట విరుగుటకే నన్నట్టు, అంతకోపం చల్లారిపోయింది. అదీకాక ఆఫీసరు తన్నేదో అన్నందుకు సుశీల అనవసరంగా బాధించటం న్యాయంకాదని తట్టటమే, తరవాయి. మొహంమీదికి చిరునవ్వు తెరలు దించేసుకుని కాఫీ నెమ్మదిగా చప్పరిస్తూ కడిగిన ఆణిముత్యంలావున్న సుశీల అందాన్ని వోమూల తాగేస్తూ ‘అయితే నీ కోపానికీ-విసుగుదలకూ కారణం?’ అనడిగాడు.

“మనింటి వెనకాల ఇంతపెద్ద పెరడుంది కదా! ఎప్పుడైనా నాలుగు పూలమొక్కలు నాటారా? ఎంతసేపూ ఆ క్రికెట్టుగోల! సినిమాగోల!”

“ఏవిటేవిటి? హఠాత్తుగా ఇన్నాళ్ళూలేని ఆలోచన ఇప్పుడెలా కలిగింది?” అంటూ వెక్కిరించాడు కేశవరావు. బోలెడు బ్యాక్ గ్రౌండ్ వుంటేనేకాని సుశీల ఇలాంటి ప్రశ్న వెయ్యదని అతనికి తెలుసు.

“ఇంతకీ జరిగింది వినండి...ఇందాకా బేబీ గులాబీపూలు కావాలని ఏడవటం మొదలెట్టింది. వీధిలో పువ్వు లెంతకీ రావాయె. మీరు ఎంతకీ రారు. కాస్సేపు ఆగమంటే అదేమీ వినదు. అందుకని పక్కింటి జానికమ్మ దొడ్లో గులాబీలు

బోలెడు పూస్తున్నాయికదాని నాలుగు పువ్వులిమ్మనడిగాను. ఆవిడ మొహమాటమే నా లేకుండా తనింట్లో పువ్వులు పూరికే అందాని క్కాని తల్లో పెట్టుకోడానిక్కాదు. ఇవ్వటానికి వీల్లేదంది. నాతో చనువుగా వుంటోందికదాని నేనే కోసుకుందామని వెళ్ళాను. ఆవిడ రాక్షసిలా 'ఇది మీ యిల్లా మా యిల్లా?' అనడిగింది. జానకమ్మ ఎందుకిలా మారిపోయిందో నాకర్థంకాదు." సుశీల ఆగి తన మాటలు భర్త కళ్ళల్లో ఎలాంటి పరివర్తనను కలిగిస్తున్నాయోనని చూసింది.

"బహుశా నిన్న చేబదులివ్వనందుకేమో. అదీ కాక గులాబీపూల విషయంలో ఆమె ఆర్గ్యుమెంటు బాగానే వుంది. కొంతమంది అందానికే పెంచుతారు."

"అలాగైనా బాగుండేది. కాని మరో పది నిమిషాలకి ఎదురింటి అన్నపూర్ణ అడక్కానే నాలుగు తెల్లవి, నాలుగు ఎర్రవి కోసిచ్చింది. అది నే కళ్ళారా చూశాను. ఇంకా 'ఏమందో తెలుసా? అందరికీ పువ్వులు పంచివ్వడానికి ఇదే మానాన్న పూలసత్రమా?' కావాలంటే తన దొడ్లో కూడా పూలమొక్కలు వేసుకోమను అంది."

"ఇంతకీ బేబీయేది?"

"ఇందాకా అమ్మకానికొస్తే పూలు కొనిచ్చాను. ఆడుకోటానికి పోయింది."

జానికమ్మ మనస్తత్వం కేశవరావుకు ఎంత మాత్రం ఆశ్చర్యాన్ని కలిగించలేదు. రేడియోలున్న కొంతమంది వినటానికి నలుగురూ చేరేసరికి గుభుక్కున రేడియో కట్టేస్తారు.

"అయితే ఏం చెయ్యమంటావ్? ఆఫీసునుంచి వచ్చేటప్పుడు రోజూ గులాబీ పూలు కొనుక్కురమ్మంటావా?" సుశీల కళ్ళు 'మీకు బొత్తిగా యిదిలేదు' అన్నాయి.

"బాగుంది...ఇంతకంటె ఆగోడతో చెప్పుకుంటే నయం" మానవత్వానికి ముప్పు తెచ్చిపెట్టి, చరాచరాలకున్న భేదాన్ని తుంచివేస్తున్న ఆ "గోడ" ప్రయోగానికి కేశవరావుకు కొంచెం కోపం వచ్చినా దిగమ్రింగి ఇంకా చెప్పమన్నట్టు చూశాడు.

"వాళ్ళింట్లో అన్ని మొక్కలున్నాయి కనకనే అంత ఎగిరి పడుతోంది. ఏడాది తిరిగేలోగా మనింట్లోకూడా-గులాబీలు-కనకాంబరాలు-చామంతులు అన్నీ పూయాలసిందే,లేకపోతే-" అని పుట్టింటికి పయాణం కడతానన్నట్టు చూసింది. ఆ చూపుకి కేశవరావు కల్పించుకున్న అర్థం మాత్రమే అది.

"ఓహో! ... అంటే ఏడాది తిరిగేలోగా మనింటివెనకాల వో ఛోటాగార్డెన్. అంటే నలుగురూ పార్కుని భ్రమించేలాగ తయారవాలంటావు. అంతేనా! పావుటావు కాగితంముక్క కలం పడేస్తే వుద్యోగానికి రాజీనామా చేసి పొద్దున్నే నూతికి ఏతాంకట్టి పని ప్రారంభిస్తా" సుశీల కస్సుమని వెనక్కి తిరిగి కోపంతో కళ్ళు పెద్దవిచేసి 'అంత వేళాకోళంగా వుందే! మనిషి దగ్గర అసలు సీరియస్ నెస్ కనిపించదేం ఖర్మ! మీరేన్నన్నా అనుకోండి. రేప్పొద్దున్న గులాబీ అంటు తీసుకొచ్చిదొడ్లో నాటి తీరాలి...'

"వర్షంలోకాని అవి బతకవు" అని తప్పించుకోబోయాడు.

"శుభం పలకరా అంటే పెళ్ళికూతురు ముండేది? అన్నాట్ట. ముందు అంటు తీసుకురండి...?

'అవిక్కడ దొరకవ్.'

సుశీల అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. కోపం వచ్చిందనుకున్నాడు కేశవరావు. ఆనాటి సత్యభామకు మల్లే తలకు కట్టుకట్టుకుని (అవసరమైతే అమృతాంజనం రాసుకుని) కోపంవచ్చినట్టు డిక్లేరు చేయటాని తనింట్లో కోపగృహంలేక పోయినందుకు కేశవరావు అప్పుడప్పుడు చింతించకపోలేదు.

ఇంత పెద్దపట్టణంలో అతనికి పెద్దపెద్ద ఎంపోరియాలు. సిల్కుషాపులు, కంపెనీలు కనిపించాయి కాని గులాబీ అంట్లమ్మేస్థలం కనిపించలేదు. సుశీలక్కలిగిన కోరికలు (ఎలాంటివైనాసరే-రిఫర్-కొండమీదికోతి సామెత) తీరేవరకూ ఆమె అల్లుకూన్న పద్మవ్యూహంలో చిక్కుకుని తను బాధ పడాల్సిందే! ఇందాకటి 'బోడి' ఆకాశంకేసి క్వశ్చన్మార్కు వేస్తూచూశాడు.

వర్షాదుదయం తొమ్మిదిన్నరకు కేశవరావు విజయగర్వంతో పెద్దఅంగలు వేసుకుంటూ రెండుచేతుల్లోను రెండు గులాబీ మొక్కల్తో తయా

రయ్యాడు. సుశీల విజయుడై తిరిగివచ్చిన వీరుడికి హారతిస్తున్నట్టు రెండు కళ్ళతోనూ చూసింది.

"ఇవేళ మీకెలాగా ఆఫీస్ లేదుకనక దొడ్లో నాటేద్దాం పదండి." అంటూనడిచింది. కేశవరావామెను వెంబడించాడు. నాలుగడుగులు వేశాక సుశీల హఠాత్తుగా ఆగిపోయి గోడకేసి చూసింది.

"ఇవేళ అష్టమండీ మంచిరోజు కాదు. అష్టమి నవములు కష్టదినములన్నారు."

"ఆ...అష్టమీ .. సింగినాదం. నాకలాంటి పట్టింపులూ నమ్మకాలూ లేవు. సుముహూర్తాల్లో చేసిన పెళ్ళిళ్ళు ఎన్ని విషాదాంతాలవటంలేదు?"

సుశీల మాత్రం అతనిమాటలేవీ తనకు వినిపించనట్టు నిర్లక్ష్యంగా "ఇవేళ్ళకి మానేద్దామండీ" అంది.

కేశవరావదేమీ వినిపించుకోకుండా రెండు గోతులు తీసి రెండు మొక్కలూ నాటాడు.

"కొన్నాళ్ళకు మనింటోనూ కావలిసినన్ని పూలు పూస్తాయి. ఒకళ్ళ అవుసరం మనకేవిటి?" అంది గట్టిగా. ఈ మాటలు పిట్టగోడకి కొంచెం అవతల కాలిబాటన వేళ్ళమీద నిలబడి తన దొడ్లో జరుగుతున్న తతంగాన్ని కన్నార్పకుండా గమనిస్తున్న జానికమ్మ నుద్దేశించన్నవని గ్రహించటానికెంతోసేపు పట్టలేదు కేశవరావుకు. సుశీల బాల్చీతో నీళ్ళుతీసుకొచ్చి పోసింది.

పక్కింటి జానికమ్మ నేరోగేజీమీద రైలింజనులా తుభుక్కున తుమ్మింది. మరోటి తుమ్మితే దోషపరిహార మవుతుందని ఎదురుచూశాడు.

"అష్టమి... వెధవముండ" అని గొణిగింది సుశీల. కేశవరావు నవ్వి వూరుకున్నాడు.

ఆ మర్నాటినుండి కేశవరావు కార్యక్రమంలో మరో 'అయిటం' చేరింది. ప్రొద్దున్న లేచీలేవటంతోనే దొడ్లోకి పరుగెత్తి గులాబీ మొక్కలవంక చూసేవాడు. సుశీలకు మాత్రం జానికమ్మ ఇంకా తన చెవులదగ్గర తుమ్ముతున్నట్టే వుంది. మొక్కలు బతుకుతున్నాయో లేదోనని జాగ్రత్తగా పరిశీలించేవాడు. వర్షాలు కురవవలసిన కాలమైనా ఎండలు తీవ్రంగా కాసాయి. బేబీమాత్రం దొడ్లో గులాబీ మొక్కల సంగతి వాడవాడలా చాటింది.

సరిగ్గా వారంరోజులు గడిచాక ఆకులన్నీ నల్లగా మాడిపోయుండటం గ్రహించిన కేశవరావుకు పెద్దగా ఏడుపొచ్చింది. సుశీల ఇంకవి బతకవని నిర్ణయించుకున్నాక జానికమ్మను ఛెడామడా తిట్టింది. "అష్టమినాడు వద్దంటే విన్నారు కాదు. సర్వజ్ఞుడిలా కబుర్లుచెప్పారు. అంత పంతంమీద వున్నదాన్ని. ఇప్పుడా ముండ కెంత లోకువై పోతాను? నామాటేమైనా విన్నారు కనకనా? ఇప్పుడేవంటారు?" సుశీల ఇంచుమించు ఏడుస్తూ అంది. 'ముండ'నే శబ్దప్రయోగం కేశవరావుకు బుధజన సమ్మతంగా కనపడలేదు. పంతానికి దిగితే బాధేమరి.

నాలుగురోజుల కితం ఆఫీసుకు పోతుంటే జానికమ్మ మొగుడు కనబడి 'మీ యింటో గులాబీ మొక్కలు నాటారుగా మోలు! సర్వైవ్ అవుతున్నాయా?' అనడిగాడు అర్థోక్తిగా. అతనంత సూటిగా, వెక్కిరింతగా అడిగినందుకే కేశవరావుకు ఇన్ఫినిటీయంత కోపం వచ్చినా దాన్ని దిగమింగుకుని ముఖంమీద చిరునవ్వు అంటించుకుని "ఆ... అవుతేఅవుతాయి, లేకపోతే లేదనుకోండి. దానికేం గాని చూడండి!... నేను ప్రస్తుతం చాలా యిబ్బందుల్లో వున్నాను. కనక మీరు దయచేసి—అంటే మళ్ళీ తిప్పకుండా— వాయిదావెయ్యకుండా నాకివ్వాల్సిన యాభైరూపాయలు పూర్తిగా బకాయి లేకుండా ఇచ్చేయండి. చాలా అర్జంటు. ఇవ్వలేకపోవడం మీకూ నాకూ శ్రేయస్కరం కాదు" అన్నాడు. జానికమ్మ మొగుడి గొంతులో పొటాషియమ్ సైనైడు పడ్డంత పనైంది. సరైన సమయంలో సరైన అస్త్రాన్ని ప్రయోగించి అతని నోరు నొక్కినందుకు తనకుతానే వో సర్టిఫికేటు ఇచ్చుకున్నాడు.

"అంత తొందర్లో ఎలాగండీ? కొంచెం గడువిస్తే..." అని సాగదీసాడతను. కేశవరావు లాభం లేదన్నట్టు ఖచ్చితంగా తలవూపేసి విసవిసా వెళ్ళిపోయాడు. ఇంతకాలం స్నేహంగావున్న తమ యిద్దరిమధ్యా ఇలాంటి అగాధం తలెత్తడానికి కారణం ఈ గులాబీపూలన్న సంగతి కేశవరావుకు తట్టగానే కొంచెం బాధపడ్డాడు. కాని దాన్ని ఇతర సంఘటనల్తో కప్పిపుచ్చుకున్నాడు.

ఈ ఆలోచనలన్నీ ఒక్కసారి అతని మెదడులో మెదిలాయి.

"మళ్ళీ అంట్లు కొనుక్కొస్తాను. ఎందుకు బతకవో చూస్తాను" అంటూ కేశవరావు బయట

వెళ్ళాడు. సుశీలకుమాత్ర మిదంతా అపస్వరంలా కనిపించింది. మరో గంటకల్లా దొడ్లో మళ్ళీ గులాబీమొక్కలు నాటబడ్డాయి.

ఆ సాయంత్రం, సుశీల యింటో మొదట నాటబడ్డ రెండు మొక్కలూ జీవయాత్ర చాలించినందుకు జానికమ్మ సంతోషం హద్దులుదాటి పయనిస్తున్నట్టు, "వాళ్ళింట్లో పూల మొక్కలు కూడానా?' అని జానికమ్మ సాగదీస్తూ వెక్కిరించినట్టు సుశీలకు నిస్తంత్రి వార్తలు వచ్చాయి. సుశీల అనవసరంగా ఈ రొంపిలో ఎందుకు దిగానాని బాధపడింది. ఆ సాయంత్రమే జానకమ్మ మొగుడు కేశవరావు మొహంమీద యాభై రూపాయలు 'విసిరికొట్టి' పోయాడు.

తరువాత వారంరోజులు సుశీల, కేశవరావు మొక్కలకి జాగ్రత్తగా సంరక్షణచేశారు. ఉల్లిపాయలకు తనకూ విరోధం వున్నా ఉల్లిపొట్టు వేశాడు.

కాని—

ఏడోరోజు సాయంత్రానికి అవికూడా తనువు చాలించాయి. సుశీలకు జానికమ్మ తన చెవులదగ్గర కొచ్చి పకపక నవ్వుతున్నట్టనిపించింది.

"మన గ్రహచారం" అంది వుడుకుమోత్తనంతో. కేశవరావు వెల్లవేసిన మొహంతో సుశీల కేసి చూశాడు.

"ప్రతిదానికీ శకునపక్షిలా పలికారు" ఈ నిందలో ఎలాంటి పస కనిపించలే దతనికి.

"మనం వెంటనే ఇల్లు మారిపోవాలి."

"ఏం?" అన్నాడు కేశవరావు ఆశ్చర్యంతో నిండిన కళ్ళతో.

"ఆ జానకి మరీ రెచ్చిపోతుంది. తప్పదు. దానితో అనవసరంగా పంతం తెచ్చుకున్నాను. దాని మొహం ఎలా చూడను?"

"మనం ఎందుకు ఇల్లు మారామని నలుగురూ అడుగుతారనుకో. తీగలాగితే డొంకంతా కదిలినట్టు అంతా విని నవ్వుతారు."

"మరీ అసందర్భపు మాటలు మాని ఇల్లు చూస్తారా లేదా? చెప్పండి. నలుగురూ అడిగితే ఏవైనా చెప్పొచ్చు."

కేశవరావు సరేనన్నాడు.

ఆ రాత్రి తను హుషారుగా ఇంట్లో కొస్తూ "సుశీ...సుశీ..."అని పిలిచాడు. ఎంతో ఆనందం కలిగితేనేకాని కేశవరావు సుశీల పేరుమ కత్తిరించడు. "ఇల్లు చూడమన్నావు కదూ! జానికమ్మ వుంటున్న ఇల్లే ఎల్లుండి ఖాళీ అవుతుంది. అంతా మాట్లాడొచ్చాను." జానికమ్మ దొడ్లోవున్న తెల్ల గులాబీమొక్కలు—ఎర్ర గులాబీమొక్కలు సుశీల కళ్ళముందు అటూయిటూ కదిలాయి.

"కాని జానికమ్మ ఎందుకు వెళ్ళిపోతోంది?"

"మొదటిది: ఇల్లంతా పాడుచేస్తున్నారట. రెండోది: అద్దె ఎక్కువైంది" ఆ రాత్రంతా బేబీ తన తలనిండా గులాబీపూలు తురుముకుంటున్నట్టు కలలు కంది. ఆ మర్నాడు కేశవరావు మోసుకొచ్చిన వార్త వినగానే సుశీలకు పెద్ద 'షాక్' తగిలినట్టైంది.

జానికమ్మవున్న యింట్లోని గులాబీమొక్కలన్నీ ధ్వంసమైపోయాయి. మధ్యాహ్నం జానికమ్మ సంతానం ఆ వీధులోనే వున్న ఇతర వానరాల సహాయంతో వివిధ రకాలైన ఆటలాడుతూ కర్రల్తో కత్తియుద్ధాలు చేస్తూ గులాబీమొక్కల్ని శత్రువులుగా భావించి వాటితో కూడా యుద్ధం చేసి సంహరించారు. ఈ గొడవ జరుగుతున్నంతసేపూ జానికమ్మ నిద్రలో వుందట. "ఈ కథను నేనెంతమాత్రం నమ్మను. ఇంకెలాగా ఇల్లు వదిలిపోతున్నాంకదాని తనే ఈ పని చేయించి వుంటుంది."

కేశవరావు జానికమ్మ మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేక సుశీలకేసి గుడ్లప్పగించి చూశాడు. మరో ఇల్లు చూడమంటుందేమోనని అతనికి భయంగానే వుంది.

---

"సరిగ్గా నా కొత్త చీర లాంటిదే పక్కింటావిడ కొనుక్కుంది"

"అయితే ఏం చెయ్యమంటావు? ఇంకో చీర కొనమనా నీ ఉద్దేశ్యం?" అడిగాడు భర్త. "అదే సులువు కదూ, యిల్లు మారడం కంటే" అంది భార్య.